క్లుప్తంగా

మేడిపల్లిలో విద్యాసాగర్‌రావు సందడి



బీజేపీ నాయకులతో విద్యాసాగర్‌రావు

మేడిపల్లి: మండల కేంద్రంలోని బీజేపీ సీనియర్ నాయకుడు, వేములవాడ నియోజకవర్గ కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి షష్టిపూర్తి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు హాజరయ్యారు. చాలా రోజుల తర్వాత మేడిపల్లికి విద్యాసాగర్‌రావు వచ్చారనే విషయం తెలుసుకున్న అభిమానులు మండల కేంద్రానికి తరలివచ్చారు. అభిమానుల కోరిక మేరకు స్థానిక పీఎస్ఆర్ గార్డెన్‌లో కాసేపు సరదాగా వారితో ముచ్చటించారు. కార్యక్రమంలో కారంద్ల మధుకర్, ఎస్ఎస్ రెడ్డి, తొగరి లక్ష్మిపతి, అన్నాడి జలపతిరెడ్డి, మ్యాకల రాజు, చంద రమేశ్, గంగప్రసాద్, బద్దం మహేందర్, కోటగిరి లింగం, అడువాల గంగారాం, పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌ను పరిశీలించి ఎంతమందికి రక్తపరీక్షలు చేశారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయని వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారులు సింధూజ, రజిత, సూపర్‌వైజర్ భూషణ్ ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: పట్టణంలో ఇసుక అక్రమ రవాణా సాగుతోందని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్మపురికి చెందిన దూడ మహిపాల్, జాడి ప్రేమ్‌సాగర్ శుక్రవారం తహసీల్దార్ కృష్ణచైతన్యకు వినతిపత్రం ఇచ్చారు. ధర్మపురి పుణ్యక్షేత్రంలోని గోదావరి నదికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. గోదావరిలో ఇసుకను నిత్యం ట్రాక్టర్ల ద్వారా తరలించడంతో గోదావరిలో నీటి నిల్వలు లేకుండా పోతాయని, సంబంధిత అధికారులు ఇసుక రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

మానవత్వం చాటుకున్న ఎంపీపీ



క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్తున్న ఎంపీపీ

రాయికల్: మండలం మూటపల్లి గ్రామానికి చెందిన కస్తూరి శుక్రవారం రాయికల్‌కు వెళ్తుండగా రామాజీపేట గ్రామ శివారు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. అదే సమయంలో రాయికల్‌కు వెళ్తున్న ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి తన వాహనాన్ని ఆపి గాయపడిన కస్తూరిని తన కారులో రాయికల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఎమ్మార్పీఎస్ సమావేశాలకు తరలిన నాయకులు

కథలాపూర్: ఎమ్మార్పీఎస్ జాతీయ సమావేశాలు శనివారం హైదరాబాద్‌లో నిర్వహిస్తుండగా, కథలాపూర్ మండల నాయకులు శుక్రవారం సాయంత్రం తరలివెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ జాతీయ సమావేశాలకు ప్రత్యేకత సంతరించుకుందని నాయకులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కాశవత్తుల లక్ష్మిరాజం, బొడ్డు నరేశ్, మారంపెల్లి వినోద్, ఎర్రోళ్ల నిఖిల్ సమావేశాలకు వెళ్లారు.

అత్యవసర వైద్యానికి తిప్పలు

- కష్టకాలంలో కనిపించని 108 వాహనాలు
- అత్యవసర సమయంలో ప్రైవేట్ వాహనాలే దిక్కు
- రోగులకు అవస్థలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు



108 అంబులెన్స్ వాహనం(ఫైల్)

వెల్గటూర్: ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసరమైన సమయంలో ఉచితంగా వైద్య సదుపాయం అందించే లక్ష్యంతో 2005లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 108 సేవలు ప్రారంభించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు అత్యవసర వైద్యసేవల వాహనాలు అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన ముఖ్యమైన విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. జనాభాకు సరిపడా వాహనాలు సమకూర్చడంలో విఫలమైందని, ప్రభుత్వ జనాభాకు సరిపడా ప్రతీ మండలానికి ఒక 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

వాహనాల కొరతతో ప్రజలకు ఇబ్బందులు

జిల్లాలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఎండపల్లి, బీమారం మండలాలతో కలిపి మొత్తం 20 మండలాలు ఉండగా ఇటీవల నూతనంగా అందుబాటులోకి వచ్చిన 3 వాహనాలతో కలిపి జిల్లా వ్యాప్తంగా కేవలం 12 అంబులెన్స్‌లు మాత్రమే ఉన్నాయి. మండలానికో అంబులెన్స్ అందుబాటులో తీసుకొస్తామని చెప్పిన ప్రభుత్వ హామీ మాటల వరకే పరిమితమైంది. 108 వాహనాలు అందరికీ అందుబాటులో లేక అత్యవసర వైద్యం అవసరమైన సమయంలో ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అత్యవసర సమయం కావడంతో ప్రైవేట్ వాహనాల యజమానులు అందినకాడికి దోచుకుంటున్నారు.

108 సర్వీస్‌లు ప్రారంభం

రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు, ప్రసవ సమయాలలో, ప్రజలకు అత్యవసర వైద్యసదుపాయం అవసరమైన సమయంలో 108 నంబర్‌కు ఫోన్ చేసిన 18 నిమిషాల సమయంలో ఘటనా స్థలానికి చేరుకొని ప్రజలను ఉచితంగా దగ్గర లోని హాస్పిటల్‌కు తరలించి సమయానికి వైద్య సదుపాయం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసింది 108 ఎమర్జెన్సీ సర్వీస్. కష్టకాలంలో ఉన్న పేద ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ఉచితంగా వైద్య సదుపాయం అందించి ప్రజల ప్రాణాలు కాపాడడమే దీని ప్రథమ ప్రాధాన్యత. కానీ తెలంగాణ ప్రభుత్వం అత్యవసర వైద్య సేవల వాహనాలపై సరిగా దృష్టిపెట్టక పోవడంతో అత్యవసర వైద్యం చాలా మందికి అందని ద్రాక్షగానే మిగిలింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించి పేదల సంజీవనిగా పేరుగాంచిన 108 అంబులెన్స్ లను మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



ఉమ్మడి వెల్గటూర్ మండలంలో 108 అంబులెన్స్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సమయంలో వాహనం అందుబాటులో లేక మండల వ్యాప్తంగా చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకూడదంటే ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండలానికో 108 వాహనం ఏర్పాటు చేయాలి.

– గంద్ర శ్రీకాంత్‌రావు, వెల్గటూర్

స్థానికుడిని గెలిపించాలి

- వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్



ర్యాలీలో పాల్గొన్న ఆది శ్రీనివాస్, నాయకులు

కథలాపూర్: స్థానికుడిని నేనే.. ఈ ఎన్నికల్లో ప్రజలు మద్దతు ఇచ్చి గెలిపించాలని వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ కోరారు. మండలంలోని చింతకుంట గ్రామస్తుడు, ఎన్ఆర్ఐ భైర దేవ్ యాదవ్, ఆయన సోదరుడు భైర మల్లేశం కాంగ్రెస్ పార్టీలో చేరగా భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకుడిని గెలిపిస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ నియోజకవర్గానికి చెందిన వాడినని, అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకున్న వ్యక్తిగా మీ ముందుకు వచ్చానని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఈ ప్రాంతానికి సాగునీరందించడంలో విఫలమైందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోరే కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, ఎం.డీ అజీమ్, పులి హరిప్రసాద్, తొట్ల అంజయ్య, కారపు గంగాధర్, శ్రీనివాస్, గడ్డం చిన్నారెడ్డి, ఎం.డీ హఫీజ్, వంశీ, ముబీన్ పాల్గొన్నారు.

మండలాల్లో రోడ్ షో

మేడిపల్లి: మేడిపల్లి మండలంలోని తోంబరావుపేట, విలయతాబాద్, రాగోజిపేట, ఓడ్యాడ్, గ్రామాల్లో వేములవాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ రోడ్‌షో నిర్వహించారు. ప్రచారంలో భాగంగా పెద్ద ఎత్తున మహిళలు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఒటర్లకు వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, రమేశ్ రెడ్డి, ఉప సర్పంచ్ అడువాల గంగారెడ్డి, గంగాధర్, మోత్కరావుపేట సర్పంచ్ దుంపేట నర్సన్న, తదితరులు పాల్గొన్నారు.

పని చేయని సీసీ కెమెరాలు



ఇబ్రహీంపట్నంలో పని చేయని సీసీ కెమెరాలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో నేరాలను అరికట్టేందుకు పోలీసుల ఆధ్వర్యంలో కొన్ని నెలల క్రితం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో వీడీసీ, దాతల సహకారంతో పోలీసులు ముఖ్యమైన ప్రధాన కూడళ్లలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొద్ది రోజులుగా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో గ్రామంలో జరుగుతున్న దొంగతనాలను పోలీసులు గుర్తించలేకపోతున్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నం నుంచి వర్షకొండ వెళ్లే దారిలో రోడ్లపై రైతులు ఉంచిన మక్కల బస్తాలను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో మక్కల సంచులు చోరీకి గురైన రైతులు దుకాణాల్లో ఉన్న సీసీ పుటేజీలను చూసేందుకు ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. సీసీ కెమెరాలు పనిచేయని విషయం ఎస్సై ఉమసాగర్‌ను వివరణ కోరగా, రిచార్జీ సిస్టమ్‌లు సీసీ కెమెరాల రికార్డులు ఉన్నాయని, వాటిలో రిచార్జీ లేక పనిచేయడం లేదని తెలిపారు.

అందని నీళ్ల ట్యాంకర్ల బిల్లులు

- ఏడాదిన్నరగా ఎదురుచూపులు
- జీపీ ఈజీఎస్ ఖాతాల్లో జమ కాని వైనం
- పంచాయతీలపై అదనపు భారం



ట్యాంకర్‌తో మొక్కలకు నీళ్లు పడుతున్న ఈజీఎస్ కూలీలు

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారంలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ మొక్కలకు పోసే నీళ్ల బిల్లుల విడుదలలో జాప్యంతో గ్రామ పంచాయతీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మండలంలో ఏడాదిన్నరగా ట్రాక్టర్ ట్యాంకర్లతో హరిత హారం మొక్కలకు నీళ్లు పోసినప్పటికీ ప్రభుత్వం ఈజీఎస్ బిల్లులు చెల్లింపుల్లో జాప్యం చేస్తోంది. దీంతో గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్ ట్యాంకర్ల డీజిల్ ఖర్చులకు ఇబ్బందిగా ఉందని పలువురు సర్పంచులు వాపోతున్నారు.

ఏడాదిన్నర బిల్లులు పెండింగ్

మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా, 2022 మార్చిలో బిల్లులు పెట్టినప్పటికీ ఇంత వరకూ విడుదల కాలేదు. దీంతో మళ్లీ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పంట్టేందుకు ట్రాక్టర్లలో డిజీల్ పోయడానికి ఇబ్బందిగా ఉందని పలువురు సర్పంచులు వాపోతున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీకి చిన్న గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 1 లక్ష, పెద్ద గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 1.5 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. ఈ లెక్కన 15 గ్రామాలకు సుమారు రూ.18 లక్షల నీళ్ల ట్యాంకర్ ఈజీఎస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఒక్కో మొక్కకు రూ.1.80 పైసలు..

ప్రతీ గ్రామ పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ బ్లాక్ ప్లాంటేషన్ కలుపుకుంటే చిన్న గ్రామ పంచాయతీల్లో ఒక వెయ్యి, పెద్ద గ్రామపంచాయితీల్లో 1200 నుంచి 1400 మొక్కలకు ప్రతీ వారం ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా ఉపాధి కూలీలు నీళ్లు పడుతుంటారు.ఒక్కో మొక్కకు నీళ్ల ఖర్చు రూ.1.80 పైసలను ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఈజీఎస్ ఖాతాల్లో జమ చేస్తోంది. కూలీలకు కూలీ డబ్బులు అందుతున్నప్పటికీ ట్యాంకర్లకు మాత్రం బిల్లులు రావటం లేదు.అన్ని గ్రామ పంచాయతీల్లోని జనరల్ బాడీల్లో తీర్మానాలు చేసి,ఎంబీ రికార్డులు పూర్తయ్యాయి. అయినప్పటికీ బిల్లులు అందక పోవటంతో గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లలో డీజిల్ బిల్లుల కోసం ఇబ్బందులు తప్పడం లేదు. ఈ బిల్లులు ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీ ఈజీఎస్ ఖాతాల్లో జమ చేయగా ఆ డబ్బులను తిరిగి గ్రామ పంచాయతీ జనరల్ ఖాతాకు బదిలీ చేసుకుని పంచాయితీ ఖర్చులకు వినియోగిస్తుంటారు.

అధికారుల నిర్లక్ష్యమా.. ప్రభుత్వ జాప్యమా

ట్యాంకర్ బిల్లుల జాప్యంపై ప్రజా ప్రతినిదులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.కోరుట్ల మండలానికి ఇరుగు,పొరుగున ఉన్న మండలాల్లో ట్యాంకర్ల బిల్లులు విడుదల కాగా, కోరుట్ల మండలంలో ఎందుకు జాప్యం జరిగిందనేది చర్చనీయాంశంగా మారింది. రికార్డులు అప్‌లోడ్ చేయటంలో ఈజీయస్ నిర్లక్ష్యమా, లేక నిధుల విడుదలలో జాప్యం అనేది తెలియాల్సి ఉంది.

ఎంబీ రికార్డు చేసి అప్‌లోడ్ చేశాం

మొక్కలకు నీళ్లు పోసిన ట్యాంకర్ల బిల్లులకు సంబంధించి గ్రామ పంచాయతీలు తీర్మానాలు ఇవ్వగానే ఎంబీ రికార్డులు చేసి సిస్టంలో అప్‌లోడ్ చేశాం. బిల్లుల విడుదలలో జాప్యానికి కారణం తెలియదు.

– మమత, ఏపీవో, ఈజీఎస్

కొడుకు పుట్టినరోజు... తల్లిదండ్రుల రక్తదానం



రక్తదానం చేస్తున్న రాజేందర్-వందన

జగిత్యాలజోన్: తమ కొడుకు పుట్టినరోజు సందర్భంగా అమ్మనాన్న కేక్‌లు కట్ చేస్తుండటం చూస్తుంటాం. కానీ ఈ తల్లిదండ్రులు మాత్రం తమ కొడుకు జన్మదినం సందర్భంగా రక్తదానం చేసి, ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే... జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామానికి చెందిన కర్నె రాజేందర్-వందన దంపతులు తమ కుమారుడు జన్మదినం సందర్భంగా శుక్రవారం జగిత్యాలలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. పుట్టినరోజు పార్టీల పేరుతో అనవసరపు ఖర్చులు చేయకుండా దంపతులిద్దరు రక్తదానం చేయడంతో పలువురు అభినందిస్తున్నారు.

చిత్ర కథ — నోట్ పుస్తకాలు మోసిన విద్యార్థులు



కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు ఎంఈవో కార్యాలయం నుంచి నోట్ బుక్స్‌ను శుక్రవారం ఆటోలో తెప్పించారు. ఆ బుక్స్‌ను ఆటోలో నుంచి విద్యార్థులే తీసుకవెళ్లి పాఠశాలలోని ఆఫీస్ రూంలో భద్రపరిచారు. బుక్స్ బరువుగా ఉండటంతో విద్యార్థులు మోయటానికి ఇబ్బంది పడ్డారు. పాఠశాలలో అటెండర్స్ ఉన్నప్పటికీ బుక్స్ విద్యార్థులచే మోయించటంతో విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

- మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి



సిరికొండలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ

కథలాపూర్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, నాయకులు సహకరించాలని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం సిరికొండ, కథలాపూర్, తాండ్ర్యాల, చింతకుంట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల రోజు బందోబస్తు కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ కలిసి మెలిసి ఉండి ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలన్నారు. రాజకీయపార్టీల నాయకులు సైతం పోలింగ్ రోజున స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. ఎన్నికల వేళ అల్లర్లకు కారణమైన వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి



కొవ్వొత్తుల నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

మేడిపల్లి: ఇటీవల గుండెపోటుతో చనిపోయిన కాంగ్రెస్ నాయకుడు జంగంపల్లి విజయ్‌కు శుక్రవారం బీమారం మండలం గోవిందారంలో అభిమానులు కొవ్వొత్తుల ర్యాలీ చేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బొడ్డు దామోదర్, మోగుళ్ల మధు, కార్కురి మల్లేశం, అజయ్, శేఖర్, దుంపేట తిరుపతి, రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో అభ్యసన సామర్థ్యాల మెరుగు



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి రాజేశ్

పెగడపల్లి: మండల స్థాయి కాంప్లెక్స్ శిక్షణ తరగతులు ఉపాధ్యాయులకు ఎంతగానో దోహద పడుతాయని జిల్లా సెక్టోరియల్ అధికారి రాజేశ్ అన్నారు. పెగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మల్యాల, పెగడపల్లి, కొడిమ్యాల మండలాలకు చెందిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు ఉన్నతి అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కనీస అభ్యసనాసామర్థ్యాలు సాధించుట, మెలకువలు నేర్చుకోవడం, బోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సెక్టోరియల్ అధికారి రాజేశ్ సందర్శించి మాట్లాడుతూ అభ్యసన అభివృద్ధి కార్యక్రమం నిరంతరం కొనసాగిస్తేనే విద్యార్థి సామర్థ్యాలు మెరుగుపడుతాయన్నారు. ప్రతి సబ్జెక్టులో నిర్దేశించిన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మండల నోడల్ అధికారి సులోచన, జిల్లా రిసోర్స్ పర్సన్ ఎస్కే ఆసీఫ్ అలీ, సీఆర్పీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీజీ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల విద్యార్థులు శాతవాహన యూనివర్సిటీ శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో సత్తా చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ యాద రామకృష్ణ, ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ శుక్రవారం తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు 108 ఆలయ ప్రదక్షిణలు

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం మాస తిరునక్షత్ర సందర్భంగా 108 ఆలయ ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి శుక్రవారం తెలిపారు. ఉదయం గంటలు 4.30 నుంచి రాత్రి గంటలు 10.30 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

కోరుట్లకు చేరిన శ్రీరామ పాదుకలు



శ్రీరామ పాదుకలతో భక్తులు

కోరుట్ల: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమిలో నిర్మించే రామాలయంలో ప్రతిష్ఠించనున్న శ్రీరాముల పాదుకలు భారత దేశమంతా ప్రదర్శిస్తూ శుక్రవారం కోరుట్లకు చేరాయి. ఈ సందర్భంగా శ్రీరాముల పాధుకలను పట్టణంలోని అయ్యప్ప ఆలయం, రాంనగర్‌లోని ఆంజనేయ ఆలయంలో ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో గట్ల శివకుమార్, గజం రాజు, రొండి రవికుమార్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.